వంతెనకు మోక్షం కలిగేనా?

- నిధులు మంజూరైన పూర్తికాని టెండర్
- వాగు దాటి పంటలు సాగు చేయడానికి ఇబ్బందులు పడుతున్న రైతులు



వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ మండలం సింగితం గ్రామ పంచాయతీ పరిధిలోని సింగితం వాగు వరద, రైతులు, మహిళలకు ప్రాణ సంకటంగా మారింది. ఆ గ్రామ పంచాయతీ పరిధిలో 9 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో 560 ఎకరాల్లో పంటలు సాగు చేయాలంటే వాగు దాటి వెళ్లాల్సిందే. వాగులో వరద నీటి ప్రవాహం కారణంగా భూములు బీళ్లుగా మారుతున్నాయి. గడిచిన 20 రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు సింగితం వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉదయం వాగు దాటి వెళ్లినా సాయంత్రం వాగుదాటడం, ఇంటికి రావడం కష్టంగా మారుతుంది. బాన్సువాడ, వర్ని, మండలాల్లోని కోనాపూర్, హన్మాజిపేట, మొండి సడాక్, సర్వాపూర్, గౌరారం, బడాపహాడ్, లక్ష్మాపూర్, జలాల్‌పూర్ గ్రామాల్లో ఎక్కడ వర్షం కురిసినా సింగితం వాగు ఉగ్ర రూపం దాలుస్తుంది. వాగు అవతల రంగాపురం, నర్సాపురం, రాఘపల్లి, శేర్‌ఖాన్‌పల్లి శివారుల్లో నారుమళ్లు వేసుకున్నా వరి నాట్లు సాగు చేయలేదు. వాగుపై వంతెన నిర్మించాలని చాలా ఏళ్ల నుంచి పాలకులను కోరుతున్నారు. సింగితం గ్రామస్తుల కోరిక మేరకు జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభరాజు వాగుపై వంతెన నిర్మాణాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నిర్మాణానికి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రూ.4.8 కోట్లు మంజూరు చేశారు. నిధులు మంజూరు చేస్తూ జీవో కాపీ విడుదల చేయడంతో సింగితం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరై నెల రోజులు కావస్తోంది. అయినా వంతెన నిర్మాణానికి సంబంధించిన టెండరు ప్రక్రియ చేపట్టకపోవడం గమనర్హం. వర్షా కాలంలో నాట్లు వేసే సమయానికి వాగులో వరద నీటి ప్రవాహం అధికమై అడ్డంకిగా మారుతోంది. అవతలి వైపు భూముల్లో వరి నాట్లు వేయలేక బీళ్లుగా ఉన్నాయి. అధికారులు ఇకనైనా స్పందించి సింగితం వాగుపై వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వంతెన నిర్మిస్తేనే సాగు చేస్తాం



సింగితం వాగుపైన వంతెన నిర్మాణం చేస్తేనే ఆయకట్టు కింద పంటలు సాగు చేస్తాం. వానాకాలం పంటలు సాగు చేయాలంటే వాగు దాటడం కష్టంగా ఉంది. కొద్దిపాటి వర్షానికి వాగు ఉధృతంగా వస్తుండటంతో వాగు దాటుడు ఇబ్బందిగా ఉంది. వాగుపైన వంతెన నిర్మిస్తేనే ఉపయోగకరంగా ఉంటుంది.

– దుర్గం శివకుమార్, యువ రైతు, సింగితం

త్వరగా పనులు ప్రారంభించాలి



ఎన్నో ఏళ్ల నుంచి వాగుపైన వంతెన నిర్మించాలని అడుగుతున్నా ఎవరూ కూడ పట్టించుకోలేదు. ఎమ్మెల్యే హన్మంత్ సింధే, జెడ్పీచైర్మన్ దఫేదార్ శోభరాజు కృషితో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. టెండర్లు పూర్తి చేసి వంతెన నిర్మాణ పనులు చేపట్టాలి.

– బండ కాశీరాం, రైతు, సింగితం

అనుమతి లేకుండా చెట్ల నరికివేత



ట్రాన్స్‌కో అధికారులు నరికిన చెట్లు

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లిలోని ప్రకృతి వనంలోని చెట్లను ట్రాన్స్‌కో అధికారులు ఆదివారం అనుమతి లేకుండా నరికివేశారు. ఈ విషయమై సర్పంచ్ పోతిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా చెట్లను నరికారని, కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని అన్నారు. కొన్నేళ్లుగా ఎంతో శ్రమకోర్చి చెట్లను పెంచినప్పటికి ట్రాన్స్‌కో అధికారులు సమాచారం ఇవ్వకుండా చెట్లను నరికివేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ విషయమై పంచాయతీ, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. చెట్లు ఏపుగా పెరిగి విద్యుత్ తీగలకు తగులుతుండటం వల్ల విద్యుత్ సరఫరాలో ఇబ్బంది కలుగుతోందని అందుకనే తొలగించామని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సమస్యలు పరిష్కారం



సమస్యలు తెలుసుకుంటున్న సుభాష్‌రెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన లింగంపేట మండలం మోతె, మోతెతండా, గాంధీనగర్, ఎల్లమ్మతండా, బూరుగిద్ద గ్రామాల్లో 'హాత్ సే హాత్ జోడో' కార్యక్రమంలో భాగంగా పల్లె పల్లెకు కాంగ్రెస్, గడప గడపకు సుభాష్ అన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారంలోకి రాగానే ప్రజల సమస్యలు తీరుస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

కొత్త జీపీలను ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు



పిప్పిల్ గుట్టతండాలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న తండావాసులు



కన్నారెడ్డిలో పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

గాంధారి(ఎల్లారెడ్డి): పిప్పిల్ గుట్ట తండాలో ఆదివారం సీఎం కేసీఆర్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తిమ్మాపూర్ గ్రామ పంచాయితీలో ఉన్న పిప్పిల్ గుట్ట తండాను ప్రత్యేకంగా గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తున్నట్లు శనివారం శాసన సభలో ప్రకటించారు. తండావాసులు, ప్రజాప్రతినిధులు ధన్యవాదాలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. గాంధారి సర్పంచ్ సంజీవు, జడ్పీటీసీ శంకర్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు శివాజీరావు పాల్గొన్నారు.

కన్నారెడ్డిలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కన్నారెడ్డి గ్రామంలో ఆదివారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జాజాల సురేందర్ చిత్రపటాలకు గ్రామస్తులు పాలాభిషేకం నిర్వహించారు. కన్నారెడ్డి గ్రామాన్ని నూతన పంచాయతీగా ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలను గ్రామంలోని ప్రధాన కూడలిలో ఉంచి పాలాభిషేకం చేశారు. ధర్మారెడ్డి సర్పంచ్ శ్రీధర్‌గౌడ్‌తోపాటు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'ధ్యానం సర్వరోగ నివారిణి'



మాట్లాడుతున్న మాస్టర్ దామోదర్

కామారెడ్డి రూరల్: ధ్యానం సర్వరోగ నివారిణి అని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ సీనియర్ మాస్టర్ దామోదర్ అన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని ఇల్చిపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ జ్ఞాన సరస్వతి ధ్యాన మందిరానికి ఆదివారం ఆయన విచ్చేశారు. పక్కనే ఉన్న ధ్యాన కేంద్రంలో మెడిటేటర్స్‌తో మాట్లాడారు. ధ్యానం వల్ల మన ఆరోగ్యానికి అనేక రకాల ప్రయోజనాలున్నాయన్నారు. ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. పీఎస్ఎస్ఎం ప్రతినిధులు రామ్ కిషన్, చంద్రశేఖర్, భూమిరెడ్డి, జ్ఞానేశ్వర్, ఇల్చిపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాల ఎన్నిక..

ఆదివాసి నాయక్‌పోడ్ మండల కార్యవర్గం



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల ఆదివాసి నాయక్‌పోడ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు సమక్షంలో మండల అధ్యక్షుడిగా మచ్చ సాయిలు, ఉపాధ్యక్షుడిగా మేడి సాయిలు, ప్రధాన కార్యదర్శిగా నూక లక్ష్మణ్, కోశాధికారిగా కొత్తపల్లి రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు మెట్టు పెంటయ్య, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

బీసీసీ యూత్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం



కామారెడ్డి టౌన్: కామారెడ్డి బీసీసీ యూత్ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిట్టిమల ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా దుబ్బాక ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా మోతే సంతోష్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా సుతారి రాజు, ముఖ్య సలహాదారులుగా అన్మండ్ల సురేష్, కుప్ప రాము, తదితరులను ఎన్నుకున్నారు.

మున్నూర్ కాపు సంఘం అధ్యక్షుడి ఎన్నిక



బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద మున్నూర్ కాపు సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి నారం సంజీవ్ తెలిపారు. అధ్యక్షుడిగా బొమ్మల లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా సాయిని అశోక్, బాస సాయిలు, ప్రధాన కార్యదర్శిగా నారం సంజీవ్, వెంకటేశ్ తదితరులను ఎన్నుకున్నారు. అలాగే గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా సాయిని శంకర్, ఉపాధ్యక్షుడిగా పేర్‌శెట్టి పండరి, ప్రధాన కార్యదర్శిగా సాయిని పండరి, తదితరులను ఎన్నుకున్నారు.

మద్నూర్‌లో ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం



మద్నూర్(జుక్కల్): మద్నూర్ మండల నూతన ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా ఆర్మూర్‌వార్ హన్మాండ్లు, ఉపాధ్యక్షుడిగా శివాజీ అప్పా, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్ గౌడ్, సహాయ కార్యదర్శిగా బాలాజీ, తదితరులను ఎన్నుకున్నారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని నూతన అధ్యక్షుడు అన్నారు.

క్లుప్తంగా

ఆలయానికి విరాళాలు



భిక్కనూరు: తిప్పాపూర్ గ్రామంలోని వేంకటేశ్వరాలయ అభివృద్ధికి పలువురు ఆదివారం విరాళాలు అందజేశారు. ఇస్సానగర్ గ్రామానికి చెందిన పోరండ్ల వెంకటేశ్వర్‌రావు–-అహల్య, మనోహర్-విజయలు రూ.11వేల 116లను, కొండాపూర్ గ్రామానికి చెందిన విజయ-మనోహర్ రూ.11వేల 116లను విరాళంగా అందజేశారు. వీరిని ఆలయ కమిటీ చైర్మన్ తాటిపల్లి సిద్ధరాములు సన్మానించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు రాజయ్య నర్సింలు, ఆలయ పూజారి వెంకటక్రిష్ణలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



రాజంపేట: మండల కేంద్రానికి చెందిన స్వర్గీయ సీనియర్ నాయకులు రాధాకిషన్ భార్య కళావతి ఆదివారం అనారోగ్యంతో చనిపోయింది. స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ వారి కుటుంబానికి రూ.10 వేల సాయం ప్రకటించారు. మండల అధ్యక్షుడు యాదవరెడ్డి చేతుల మీదుగా ఆదివారం మధ్యాహ్నం బాధిత కుటుంబానికి రూ.10 వేలు అందించి ఆర్థిక భరోసా కల్పించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు వీరన్న పటేల్, టౌన్ అధ్యక్షుడు గంగాధర్ గౌడ్, యూత్ అధ్యక్షులు అంకం క్రిష్ణారావ్, తదితరులున్నారు.

స్నేహితుడి కుటుంబానికి..



భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న తమ స్నేహితుడి కుటుంబానికి ఆదివారం స్నేహితుల దినోత్సవం రోజున ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన నాగార్తి నరేశ్‌రెడ్డి గత జూన్ నెలలో ఆత్మహత్య చేసుకున్నాడు. నరేశ్‌కు భార్య మమత, కుమార్తె నక్షత్ర ఉన్నారు. వీరు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న నరేశ్ చిన్ననాటి స్నేహితులు ' రూ.36 వేలు అందజేశారు. అలాగే నరేశ్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. స్నేహితులు లింగారెడ్డి, నీలేందర్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీధర్, నరేశ్, సందీప్, స్వామి, ధర్మారెడ్డి సతీష్, అనిల్, రాజులు పాల్గొన్నారు.

బీడీవర్కర్స్ కాలనీలో అభివృద్ధి పనులకు శ్రీకారం



బాన్సువాడ: పట్టణంలోని పీఎస్ఆర్ బీడీ వర్కర్స్ కాలనీలో త్వరలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ స్థల పరిశీలన చేశారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, ఇంటింటికి మిషన్ భగీరథ తాగునీటికి పైప్‌లైన్ పనులు చేయిస్తామన్నారు. అలాగే పాఠశాల భవన నిర్మాణం కోసం రూ.15 లక్షలు, హనుమాన్ మందిరం కోసం రూ.10 లక్షలు మంజూరయ్యాయని, వాటి నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. త్వరలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట కౌన్సిలర్ మోతీలాల్, కాంట్రాక్టర్ సిద్ధిరాములు, కాలనీవాసులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో టార్పాలిన్ కవర్ల పంపిణీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కన్‌కల్ గ్రామంలో ఆదివారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బాధితులకు టార్పాలిన్ కవర్‌లను పంపిణీ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామానికి చెందిన నర్సింగరావు ఇల్లు కూలడంతో ఆ కుటుంబానికి టార్పాలిన్ కవర్‌తో పాటు కిచెన్ సెట్‌ను పంపిణీ చేశారు. అలాగే గ్రామ పంచాయతీ సిబ్బందికి హైజిన్ కిట్లను కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు కిష్టారెడ్డి, ఉప సర్పంచ్ సాయిరెడ్డి, బాపురెడ్డి, వెంకట్‌రెడ్డి, మదన్‌రెడ్డి, స్వామి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోసం 12న చలో హైదరాబాద్



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూనియన్ సభ్యులు

కామారెడ్డి టౌన్: సీపీస్ రద్దు కోసం తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 12న తలపెట్టిన చలో హైదరాబాద్ బహిరంగ సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు కుంట ఎల్లారెడ్డి కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో కార్యక్రమ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఉద్యమాల ఫలితంగానే గ్రాట్యూటి, ఫ్యామిలీ పెన్షన్ సాధించుకున్నామని, అదే విధంగా ఓపీఎస్‌ను కూడా సాధించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాణాల భాస్కర్ రెడ్డి, కోశాధికారి చింతల లింగం, తదితరులు పాల్గొన్నారు.

సుష్మాస్వరాజ్‌కు ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి సుష్మా స్వరాజ్ చిత్రపటం వద్ద బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు దత్తురాం మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకతపై జాతీయ స్థాయిలో ఎలుగెత్తిన తెలంగాణ చిన్నమ్మగా పార్లమెంటులో గలమెత్తిన గొప్ప వ్యక్తి సుష్మాస్వరాజ్ అన్నారు. ఉద్యమకారులకు తెలంగాణ వచ్చేవరకు మీ వెంటే ఉంటానని, ఆత్మబలిదానాలు చేసుకోవద్దని ధైర్యం నింపారన్నారు. మండల ప్రధాన కార్యదర్శి రాంచందర్, బొల్లారం సాయన్న, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న స్వీపర్లు

స్కూల్ స్వీపర్ల ఆందోళన

కామారెడ్డి టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని స్కూల్ స్వీపర్లు చేపట్టిన దీక్షలు ఆదివారానికి 42వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

తెలంగాణ దార్శనికుడు జయశంకర్



జిల్లా పోలీస్ కార్యాలయంలో జయంతి నిర్వహిస్తున్న పోలీసు అధికారులు



ఎల్లారెడ్డి మున్సిపల్‌లో..

సాక్షి నెట్‌వర్క్: తెలంగాణ సిద్ధాంతకర్త, నవ తెలంగాణ దార్శనికుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని ఆదివారం జిల్లాలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు జయశంకర్ అవిశ్రాంతంగా కృషి చేశారని వక్తలు అన్నారు. విద్యార్థి దశ నుంచి ఉద్యమంలో పాల్గొన్న జయశంకర్, మలిదశ ఉద్యమంలో తెలంగాణ ఆవిర్భావాన్ని చూడకుండానే అనారోగ్యంతో కన్నుమూశారని తెలిపారు. జయశంకర్ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు.



బాన్సువాడరూరల్: ఇబ్రహీంపేట్‌లో..



మద్నూర్‌లో ..

ఘనంగా స్నేహితుల దినోత్సవం



జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న స్నేహితులు



దేవునిపల్లిలో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లతో చిన్నారులు

సాక్షి నెట్‌వర్క్: ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా జిల్లాలో ఆదివారం పలు చోట్ల సంబురాలు చేసుకున్నారు. కేకులు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. గుర్తింపుగా చేతి ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను ఒకరికొకరు కట్టుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

సమాచారం..

నేడు మండల సర్వసభ్య సమావేశం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఉదయం 11 గంటల కల్లా హాజరుకావాలని కోరారు.

పెద్దమల్లారెడ్డికి ప్రభుత్వ విప్ రాక

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి గ్రామానికి ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నేడు విచ్చేస్తున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన భిక్కనూరులో విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలో ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీ ప్రమాణ స్వీకారం

భిక్కనూరు: భిక్కనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా హన్మంత్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా రాజమౌళి, డైరెక్టరుగా రాకేశ్‌రెడ్డిల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి థామస్ తెలిపారు. ఆదివారం ఆయన భిక్కనూరులో మాట్లాడారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ హాజరవుతున్నారన్నారు.

సంక్షిప్తం

ఎంపీటీసీ రిలే నిరాహార దీక్ష

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో ఎంపీటీసీ ఉమాదేవి రిలే నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారు. అన్నాసాగర్ ఎంపీటీసీ పరిధిలోని తిమ్మారెడ్డి లోలెవెల్ వంతెన నిర్మాణం, అన్నాసాగర్‌కు సర్వ చెరువు నుంచి సాగు నీరు అందేలా కాలువ పనులు చేపట్టాలని, ఆమె 11 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. డిమాండ్లు నెరవేరే వరకు దీక్ష కొనసాగిస్తానని చెప్పారు.

గద్దర్ మృతికి సంతాపం

కామారెడ్డి టౌన్: ప్రజా యుద్ధ నౌక గద్దర్ మృతి పట్ల ఆదివారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ తరుపున సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి రాష్ట్రానికి తీరని లోటని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, సీహెచ్ అనిల్‌కుమార్‌లు అన్నారు. గద్దర్ అకాల మరణం పట్ల డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు కూడా సంతాపం వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని మండలాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గద్దర్‌కు నివాళులర్పించినట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం కండెబల్లూర్ గ్రామంలోని బాలాజీ నగర్‌లో ఆదివారం సిమెంట్ రోడ్డు పనులను బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నీలుపటేల్, శివానంద్‌పటేల్, సాయాగౌడ్ తదితరులు ఉన్నారు.

మరాఠా మహా సంఘ్ జాతీయ అధ్యక్షుడికి సన్మానం

కామారెడ్డి అర్బన్: ముంబైలో నిర్వహించబోయే భారతీయ మరాఠా మహా సమ్మేళనానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఆర్య క్షత్రియులు హాజరుకావాలని భారతీయ మరాఠా మహా సంఘ్ జాతీయ అధ్యక్షుడు అప్ప సాయబ్ అయ్యర్ అన్నారు. ఆదివారం కామారెడ్డికి వచ్చిన అయ్యర్‌ను సంఘ్ జాతీయ అధికార ప్రతినిధి రాజన్‌గవాడ్, ఆర్యక్షత్రియ సంఘం జిల్లా నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో పడిగెల రాజేశ్వరరావు, శ్రీనివాస్‌రావు, విఠల్‌రావు, గంగాధర్‌రావు, కిషన్ రావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయం వద్ద జీపీ కార్మికులు నిర్వహించిన సమ్మె ఆదివారం 32వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు చెట్టి భుచ్చయ్య సమ్మెలో పాల్గొని తన మద్దతను తెలిపి, పండ్లు, ఫలహారాన్ని కార్మికులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్‌లను నెరవేర్చేవరకు సమ్మెను నిర్వహిస్తామన్నారు. సంఘం మండల అధ్యక్షుడు శివానందంగౌడ్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి వినతి

రాజంపేట: మండల కేంద్రంలో పారిశుద్య కార్మికుల సమ్మెలో భాగంగా ఆదివారం వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి వినతి పత్రం అందజేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం వంటి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

104వ రోజుకు చేరిన నిరసన దీక్షలు

భిక్కనూరు: కాచాపూర్‌లో ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 104వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం గ్రామంలోని కుల సంఘాల ప్రతినిధులు దీక్ష శిబిరంలో కూర్చుని ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.